కథ

అది మీరు చేసిన తప్పే!

కె.కె. రఘునందన

శ్రీవాత్సవ సాదా గుమాస్తా గిరీలో ఉంటూ ఖరీదైన ఇంగ్లీషు చదువులంటూ వెంపర్లాడటం... పిల్లలమీద ఒకటే ఒత్తిడి తేవటం కైలాసమూర్తికి సుతరామూ ఇష్టం లేదు.

"ఎందుకురా! కూనలుగా పుట్టినప్పటినుండీ వెధవ చదువులు... రెన్నాళ్ళు ఆటపాటలతో తిరగనివ్వు. చదువు, చదువు అంటూ తినేయకు. మేమంతా మాతృభాషలో చదువుకోలేదా? ఉద్యోగాలు చెయ్యలేదా?" అని ఆగ్రహించే వాడు కైలాసమూర్తి.

"అదికాదు నాన్నగారూ! ఈ తరం పిల్లల్లో పోటీ బాగా ఉంది. మీలాంటి, నాలాంటి చదువులు కావు, అంతా స్పీడు యుగం. చిన్నప్పుడే పునాది ఇవ్వాలి" అనేవాడు శ్రీవాత్సవ... తనమానాన తాను పబ్లిక్ స్కూల్లో జాయిన్‌చేసే ప్రయత్నాలను కొనసాగిస్తూ.



శ్రీవాత్సవకు పెళ్ళయిన యేడాదికే మగ కవలలు. వాళ్ళు ఇలా పెరిగారో లేదో అలా చదువుల గోల మొదలైంది. భార్య అనన్య పిల్లలు శరణ్, చందన్‌లను ఖరీదైన స్కూళ్ళలో వేద్దామని పట్టుబట్టింది. కైలాసమూర్తి మాటను కొట్టిపారేసి మరీ చేర్చారు.

తెల్లవారుఝామున లేచిపోయి పిల్లలకు భోజనాలు తయారుచేసి బాక్సులు కట్టిచ్చేది. బస్సుకి దిగబెట్టేది. సాయంత్రం చీకటిపడ్డాకే పిల్లల ఉనికి.

మనవళ్ళు రాగానే 'తాతయ్యా' అంటూ కైలాసమూర్తిని అల్లుకు పోయే వారు. అప్పుడువారికి తన చిన్ననాటి కబుర్లు కథలు చెబుతూ ఉండే వాడు. కొంతకాలానికి అవీ కనుమరుగయ్యాయి.

"మామయ్యగారూ! వాళ్ళకి బోలెడు వర్కులున్నాయి. అవి చేయించే సరికి రెండు గంటలు పడుతుంది. తరువాత తిండి, నిద్ర, దయచేసి వాళ్ళని పాడుచేయొద్దు". కోడలి మాటలు శరాఘాతంలా తగిలేవి కైలాసమూర్తికి.

అదే పరిస్థితి అయిదారుసార్లు ఎదురయింది. పిల్లలను దూరంగా చూడ్డమే మిగిలింది. దగ్గరగా తీసుకోవాలన్న కోరిక ఎండమావి అయింది. ఎప్పుడైనా కొడుకు, కోడలు బయటకు వెళ్ళినప్పుడు చాటుగా వారిని అక్కున చేర్చుకొని కన్నీరు విడిచే వాడు కైలాసమూర్తి.

మధురమైన బాల్యం అనుభవించాల్సిన అపురూపమైన ఈ పసి వయసులో అరదండాలు బిగించినట్టుగా పిల్లల స్వేచ్ఛకు భంగపాటును కల్గిస్తున్నారు. చిట్టిచిట్టి చేతులు నొప్పి పుట్టేంత రాతపనికి బలైపోవటం చూసి భరించలేక పోయాడు కైలాసమూర్తి.

ఒకసారి ఉండబట్టక ఆ మాటే అనేసాడు కైలాసమూర్తి. కొడుకు, కోడలు తాడెత్తున లేచారు.

''మీకు తెలీదు నాన్నగారు! ఇప్పటి తల్లిదండ్రులు వారిపిల్లలను ఏ విధంగా తీర్చిదిద్దుతున్నారో గమనించండి. డబ్బు, శ్రమ రెండు లెక్క చేయడం లేదు'' చికాగ్గా అన్నాడు శ్రీవాత్సవ.

''పిల్లలు చదువులో ముందుండాలని కోరుకుంటారు ఎవరైనా. ఆట పాటలతో గడుపుతూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకొమ్మని ఎవరూ చెప్పరు'' వ్యతిరేకిస్తూ అనేది అనన్య.

''ఇప్పుడింత పెద్దఎత్తున ఖర్చుచేస్తూ చదివిస్తే రేపు మీరు ఏం మిగుల్చు కోగలరు? మీ చివరి కాలం ఎలా గడుస్తుంది?'' కోపంగానే అనేవాడు కైలాసమూర్తి.

''తర్వాతమాట దేముడెరుగు... ఆ రోజుల్లో మీరు నాకోసం పెద్దగా ఖర్చు చేయకుండా ఏదో బడిలో పడేసారు. కాబట్టే నేను ఇంజనీరుగానో, డాక్టరుగానో కాలేక పోయాను'' అసహనంగా అనేసాడు శ్రీవాత్సవ.

''చాలా బాగా చెప్పావురా! ఎంతమంది మహనీయులు వీధి బడిలో చదివి పెద్దవాళ్ళయ్యారో... నీ తెలివితేటలకు ఈ మాత్రం కూడు పెట్టే ఉద్యోగం అయినా దొరికింది సంతోషించు.'' బాగా బాధపడుతూ చెప్పాడా మాటను కైలాసమూర్తి.

పిల్లలను ఉన్నత శిఖరాలలోకి తీసుకెళ్ళాలనుకోవటం తప్పు బట్టేది కాదు గానీ... ఇలా హారీబరీగా, ఊపిరి సలపనివ్వని విధంగా వారిని రాచి రంపాన పెట్టడం మాత్రం నచ్చలేదు.

ఫీజు ఎవరెక్కువగుంజితే అక్కడ అపారమైన జ్ఞానం దొరుకుతుందున్న వెర్రిఆశ ఒంటబట్టించుకున్నారు. గుమాస్తా జీతమనగా ఏపాటి? చదువుల వ్యామోహంలోంచి తప్పించుకోలేక దానికి డబ్బెలాగ సంపాదించాలన్న ఆలోచనల్లో మగ్గుతున్నారు.

భర్త శ్రీవాత్సవ యాతనను అర్థం చేసుకున్న అనన్య కూడా ఓ ప్రైవేటు కాన్వెంటులో జాయినయింది. తనకొచ్చే పదిహేనువందలు వేడినీళ్ళకు చన్నీళ్ళు అన్నభావన ఆమెది.



భార్యాభర్తలిద్దరూ కష్టపడేది తమ పిల్లల కోసమే... అంతా యాంత్రికం... హడావుడి... హైరానా పరుగులు... ఇవన్నీ చూస్తుంటే కైలాసమూర్తికి ఒక్కోసారి నవ్వొచ్చేది. భార్య ఇందుమతికి కూడా ఓ విడ్డూరంగా అనిపించేది.

ఒకప్పుడు తాము పిల్లలను పెంచిన తీరుకు, ఈ తరం వారి విధానాలకూ ఎంత వ్యత్యాసం ఉందో చూస్తుంటే చాలా చిత్రమనిపించింది.

ఉదయం మొదలు రాత్రి దాకా నల్గిపోతున్న పిల్లలను కాస్త లాలించి నాలుగు ముద్దుమాటలతో చేరదీద్దామన్నా సరే శ్రీవాత్సవ, అనన్యలు పడనిచ్చేవారు కాదు. తమ విధిగా చేస్తున్నట్లుగా భావించేవారు.

''పిల్లల కోసం మేమిలా నలిగిపోవటం మీకు తప్పులాతోస్తున్నట్లుంది'' అని నిష్ఠూరమాడేది అనన్య.

అదేం పట్టించుకోకుండా కేవలం ప్రేక్షక పాత్ర వహించేవారు కైలాస దంపతులు.

పిల్లలు ఇంటరుకి వచ్చారు. కార్పొరేట్ కాలేజీలో వేయటమంటే ఆషామాషీ కాదు. శరణ్, చందన్లను ఇద్దరినీ జాయిన్ చేయడానికి లక్షలకి లక్షలు పోయాల్సిందే!

''అంత డబ్బు ఖర్చు పెట్టేకంటే మామూలు కాలేజీలో చేర్చవచ్చు కదా! నష్టమేంటి?'' అన్నాడు కైలాసమూర్తి. కొడుకు, కోడలు తర్జనభర్జనలో కొట్టుమిట్టాడం చూసి.

''ఇప్పటిదాకా చదివినదంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది. ఎంత ఖర్చయినా సరే జంకేది లేదు'' కరాఖండీగా అన్నాడు శ్రీవాత్సవ.

''నా దగ్గరున్న బంగారం అమ్మి పారేస్తాను... సరేనా! పెద్ద కాలేజీలో చదివిస్తే మీకేమైనా అభ్యంతరమా?'' ఎదురుదాడికి దిగింది అనన్య.

''అదికాదమ్మా! నిక్షేపంలాంటి బంగారం నీ ఒంటి మీదుంటే మహాలక్ష్మి లాగుంటావు. కోరి నగలను అమ్ముతామా? ఒకవేళ అమ్మితే మళ్ళా చేయించుకోగలవా?'' మృదువుగా వారించింది ఇందుమతి.

అయినా వినలేదు వాళ్ళు. బంగారం అమ్మేకంటే కుదువబెట్టి రుణం తెచ్చుకోమని సలహా ఇచ్చాడు కైలాసమూర్తి.

ఏ కళ నున్నారోగాని ఆయన సలహా మేర రుణం తెచ్చి శరణ్, చందన్‌లను బంగారు

పంజరంలాంటి కార్పొరేట్ కాలేజీలో పడేసారు.

ఆ చిన్నారుల తలలు కాటెక్కిపోతున్నాయి. ఓ ఆదివారం లేదు... పండుగలు, పబ్బాలు లేనే లేవు.... నిరంతర హైరానా... ఒకటే పరుగు... ఇంటర్అయింది. ఆ వెంటనే ఎం.సెట్. అందులో ర్యాంకులకై వెర్రి పరుగు... ఆ వెంటనే ఇంజనీరింగ్లో జాయిన్ చేయడానికి మళ్ళా డబ్బుల కోసం వెతుకులాట... ఈసారి భారీగానే మదుపు. ఖర్చు... ఒకటే ఖర్చు.

వాళ్ళు అంత డబ్బు వెచ్చిస్తున్నది పిల్లల బ్రతుకును అందంగా తీర్చిదిద్దాలనే తపనతోనే అనేది వారి వాదన... తమకుందోలేదో అది వేరే విషయం... పిల్లలను కష్టపడి చదివిస్తున్నాం అనే మాటకు కట్టుబడ్డారు.

నిజానికి ఆ రోజుల్లో తమను తల్లిదండ్రులు మామూలు చదువే చదివించారు. ఏదో తను హయ్యర్ గ్రేడు టీచరుగా చేస్తూనే శ్రీవాత్సవను చదివించాడు కైలాసమూర్తి.

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందున్న సూక్తి కైలాసమూర్తి పాలిట నిజమయింది. రాజకీయనాయకులను పట్టుకుని కాంట్రాక్టు పద్ధతిలో చిన్నగుమాస్తాగా వేయించాడు. దేముడు అనుగ్రహించాడు కాబోలు ఆ నౌఖరీ ఖరారయింది. ఆ భిక్ష ఉండబట్టే తన పిల్లలను చదివించగలుగుతున్నాడు శ్రీవాత్సవ.

అయితే పిల్లల మనోభీష్టాలను కనుక్కోకుండా, స్వేచ్ఛాగాలులు పీల్చు కోడానికి వీల్లేకుండాచేసి చదివిస్తున్నారనే కైలాసమూర్తి దంపతుల ఆవేదన... దానికి వాళ్ళు పెట్టిన పేరు వ్యతిరేకత....

చూస్తుండగానే పిల్లలిద్దరికీ ఇంజనీరింగు అయిపోవటం, క్యాంపసు ఇంటర్వ్యూల్లో సెలక్టయి పోవటం గబగబ జరిగిపోయాయి.

ఖండా తరాలలో పనిచేయడానికి ఎంపిక చేసిన ఆ పెద్ద కంపెనీలు పూచీకత్తుగా చెరో లక్ష రూపాయలు ఇవ్వాలన్నారు. లేకుంటే జాయిన్ చేసుకోరట... పిల్లల ఉద్యోగాల ష్యూరిటీ సొమ్ము కోసం పల్లెలో ఉన్న మడిచెక్కను అమ్మితానని పట్టుబట్టాడు శ్రీవాత్సవ.

''ఒరే! కడుపు నింపే అన్నపూర్ణమ్మ లాంటి పొలాన్ని నమ్ముకున్న మనం అమ్మకానికి పెట్టడం తగదురా!...'' అని తన అంతరంగ ఘోషను వినిపించాడు కైలాసమూర్తి.

ఇందుమతి సైతం తన ఆవేదనను, ఆపేక్షను వ్యక్తం చేసింది. కానీ శ్రీవాత్సవకు ఆ భూమి మీదనే కన్నుపడింది. ఎందుకంటే హటాత్తుగా రెండు లక్షల రూపాయలు ఎక్కడ నుండి తేవాలో బోధ పడలేదు.

చివరికి అమ్మకానికి కాకుండా తనఖాకి అయితే ఫరవాలేదనిపించి మెత్తబడ్డాడు కైలాసమూర్తి.

''మా పిల్లలకు వేలకు వేలు జీతాలు. రేపు వాళ్ళే మన పొలం విడిపిస్తారు నాన్నగారూ!'' అని గర్వంగా చెప్పాడు శ్రీవాత్సవ.

శరణ్, చందన్లు ఇద్దరు దేశం గాని దేశం పోతున్నారని తెలిసిన కైలాసమూర్తి మది మారుమూలల్లోంచి నిస్తేజం...

తాము కాలం చేసేనాటికి మనవలిద్దరూ అందుబాటులో ఉంటారో ఉండరోనని ఒకటే వగచింది ఇందుమతి. ఇందుకు విరుద్ధంగా ఉన్నారు అనన్య, శ్రీవాత్సవలు... విదేశాల్లో ఉద్యోగాలిచ్చి పిల్లలు స్థిరపడుతున్నారని మహ ఉత్సాహభరితంగా అయ్యారు. ఇంతకాలం తాముపడ్డ వ్యయ ప్రయాసలకి ఫలం దక్కిందని తెగ మురిసిపోయారు. ఉద్యోగం పేరుతో వెళ్ళినా అక్కడ ఒంటరిగా ఎలా ఉండగలరోనన్న చింతకంటే... వెళ్ళాక వాళ్ళు పంపే డబ్బుపైనే ధ్యాస ఏర్పడింది శ్రీవాత్సవ దంపతులకు.

ష్యూరిటీ డబ్బు కట్టాక ఆర్డర్సు అందాయి. శరణ్, చందన్లు మాతృదేశానికి వీడ్కోలు పలికి విదేశంలో కాలుమోపారు. తొలి రోజుల్లో ఠంచనుగా ఎప్పటికప్పుడు ఫోన్లు చేసేవారు.

''బాగున్నారా? మీ ఆరోగ్యం ఎలా ఉంది? ఏం చేస్తున్నారు?'' అని కుశల ప్రశ్నలు...

రానురాను పని ఒత్తిడివల్ల పలకరింపు ధోరణిలో మార్పువచ్చింది.

''ఆరోగ్యం బాగులేకపోతే ఓసారి డాక్టరుకు చూపించుకోండి. మీరు మా కోసం బెంగపెట్టుకోకండి'' అనే ముక్తసరి మాటలు. ఎప్పుడైనా 'తాతగారు బాగున్నారా' అని అడిగితే గొప్పే!

ఇటువంటి పరిణామాలు సహజాతి సహజం అయినప్పటికీ శ్రీవాత్సవ, అనన్యలను ఎదురు దెబ్బ తీసింది. తమ పిల్లలు అక్కడికి వెళ్ళాక విశేషాలు వివరిస్తూ మాట్లాడి, మా జీవితానికి మీరు భిక్ష పెట్టారు. అని పదే పదే కృతజ్ఞతలు చెబుతూ పొంగిపోతుంటే తాము విని సంబరపడాలనుకున్నారు.

రెండు నెలల తదుపరి చెరో ఇరవై వేలు పంపారు. అక్కడ తాము ఖరీదైన జీవితం గడపాల్సి వుంటుందనీ, హోదాకి తగ్గట్టుగా ఉండాల్సి రావటం వల్ల లక్షల కొద్దీ ఖర్చు అవుతుందనీ, చెప్పుకొచ్చారు. అలా అలా వారి గుండె అరల్లోంచి అభిమానం క్రమేపి క్షీణించసాగింది.

ఆ దశలోనే అశనిపాతంలాటి వార్త! శరణ్, చందన్లు అమెరికాలో వేరే కులం అమ్మాయిలతో ప్రేమలో పడ్డట్టు...!! త్వరలో వివాహం చేసుకుంటున్నట్లు హఠాత్తుగా ప్రకటించారు.

''చూశావా! అనన్యా! పిల్లలు మనకిచ్చిన గౌరవం. ఇంతకాలం వాళ్ళని బాగా పెంచుకొచ్చాం. మన ఆనందాలన్నీ వదులుకొని వచ్చిన జీతం రాళ్ళన్నీ పిల్లల చదువులకే పోసాం. ఖర్చుకు వెనకాడలేదేనాడూ! కానీ ఇప్పుడేం చేసారో చూడు'' అని వడివడిగా వస్తున్న కన్నీళ్ళను ఒత్తుకున్నాడు శ్రీవాత్సవ.

''ఔనండీ! నా ఒంటిమీద బంగారం కుదువబెట్టాను. ఈనాటికీ ఆ రుణం మసిమరకలా వెక్కిరిస్తూనే ఉంది. మావయ్య గారికి ఇష్టం లేకపోయినా పొలం తనఖా పెట్టాం. లక్షలాది రూపాయలు వెచ్చించి విదేశాలకు పంపించాం. ఆ పొలం ఇంకా మన చేతుల్లోకి రానేలేదు. కనీసం మనతో మాట మాత్రంగానయినా చెప్పనేలేదు. మన ఇష్టాలతో వారికి సంబంధం లేదు. ఛీ! విశ్వాసఘాతకులు''. జుగుప్స అణువణువూ నిండింది అనన్యలో.

''చూశావా! వాళ్ళకోసం నా రక్తంలో లేని అవినీతిని అలవాటుగా చేసు కొని డబ్బులు ప్రోగు చేసి ధార పోసాను. కానీ వాళ్ళు నీతిలేని వాళ్ళలా ప్రవర్తించారు. పిల్లలకోసం ఖర్చుచేసిన ప్రతీపైసా నా డైరీలో రాసుకున్నాను. తేదీలతో సహా... ఏదో రోజు వాళ్ళు ఈ గుమ్మంలో అడుగు పెట్టకుండా ఉండరు. అప్పుడు ఈ డైరీ వాళ్ళ మొహం మీద కొడతాను'' అంటూ లోనికి వెళ్ళి ఓ ఎర్రబైండు పుస్తకం పట్టుకు వచ్చాడు శ్రీవాత్సవ.


ఈ ఎండలకి ఒక్క గొడుగేం సరిపోతుంది చెప్పండి..?
కళ
రాంమోహన్

‘‘చూడు అనన్యా! చూడు... వాళ్ళకోసం నేను చేసిన ఖర్చు. డబ్బును నీళ్ళప్రాయంలా పారబోసాను. నా రక్తమాంసాలు కరిగించి మరీ..’’ అన్నాడు ఆగ్రహం, ఆవేదనలను సమ్మిళితం చేస్తూ...

భర్త చేతిలోంచి ఆ డైరీ తీసుకొని ఒక్కో పేజీ తిరగవేస్తూ కన్నీరు కార్చసాగింది అనన్య.

‘‘అమ్మా! ఏదీ ఆ పుస్తకం ఇలా ఇవ్వు. అదీ మీకు అభ్యంతరం లేకపోతేనే సుమా!’’ అన్న కైలాసమూర్తి గొంతు విని అటు తిరిగారు.

‘‘చూడండి నాన్నగారూ! నేనెంత కష్టపడి డబ్బు సంపాదించానో, అంత కంటే అధికంగా పిల్లల కోసం ఖర్చు పెట్టాను. వారి భవిష్యత్తు అందంగా తీర్చిదిద్దటానికి నేను పడ్డపాట్లు ఆ దేముడికెరుక’’ ఉద్వేగభరితంగా అన్నాడు డైరీని తండ్రి చేతిలో పెడుతూ....

సావధానంగా డైరీలో పేజీలన్నీ ఓసారి తిరగేసి చూసి – ‘‘భేష్! చాలా బాగుందిరా! ఖర్చు వివరాలింత భద్రంగా ఇంతకాలంగా దాచుకుంటూ వస్తున్నావంటే ఆశ్చర్యంగా ఉందిరా! నీ పిల్లల అందమైన జీవితం కోసం నువ్వు చేసిన ఖర్చు ఇదొక్కటేనా!’’ అని పెదవి విరిచాడు కైలాసమూర్తి.

‘‘పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు డబ్బుకాకపోతే మరేం ఖర్చు పెడతాం నాన్నగారూ!’’ ఠక్కున సమాధానం ఇచ్చాడు శ్రీవాత్సవ.

‘‘ఈ పుస్తకంలో కేవలం డబ్బు ఖర్చు గురించి మాత్రమే ఉంది. అదికాక మరేమైనా ఖర్చు పెట్టావేమో బాగా ఆలోచించి చెప్పు’’ అన్నాడు డైరీ తిరిగి ఇస్తూ...

‘‘అబ్బ! ఖర్చంటే డబ్బే కదా నాన్నగారూ! అంతకంటే పిల్లల కోసం ఖర్చు పెట్టాల్సినవేముంటాయి’’ విసుగ్గా అన్నాడు శ్రీవాత్సవ.

‘‘ఉన్నాయిరా! ఉన్నాయి! అది తెలీని నీ అజ్ఞానానికి నవ్వాలో ఏడవాలో అర్థం కావటం లేదు. బిడ్డల బ్రతుకుల్లో ఇంద్ర ధనుస్సుల్లోలాటి రంగులు అద్దటానికి ఖర్చు పెట్టాల్సింది కేవలం పచ్చనోట్లు కాదురా! నువ్వు డబ్బే ఖర్చు చేసావు కాబట్టి వాటి గురించే తెలుసు. నీకు తెలీనిది అనుబంధం. ఆప్యాయత, ముద్దు, మురిపం, చేరిక, చనువు, మమత, మమకారం ఖర్చు చేయటం. పిల్లల దృష్టిలో డబ్బు ఖర్చుచేసే యంత్రం లాగ కనిపించావు తప్ప ఒడిలో చేర్చి లాలించే మానవతామూర్తిగా ముద్ర పడలేదు. రాత్రి పడుక్కొనే ముందర ‘హోం వర్కు చేసే పడుకున్నారా! అని తెల్లారి లేపినప్పుడు ట్యూషన్ టైమ్ అవుతోంది త్వరగా లేవండి’ అని రెండే రెండు ముక్తసరి మాటలతో పలకరింపులు.

రంగు రంగుల గాలిపటాలు తయారుచేసి పిల్లల చేత ఎగరేయించటాలు, సరదా ఆటపాటలతో గడపడాలు, పండగ సందళ్ళు సాయంకాలం అరుగుమీద కూర్చో బెట్టుకొని కమ్మని కథలు వినిపించటం... ఏదీ! ఇందులో ఏ ఒక్క అనుభవమైనా వారికి కలిగించారా, అనుభూతులను ఖర్చు చేసారా? చదువు ఒక్కటే బ్రతుకును ఉజ్వలంగా తీర్చిదిద్దదు. మీరనేకాదు ప్రస్తుత సమాజంలో అందరూ డబ్బు ఒక్కటే పిల్లలకోసం ఖర్చు పెడుతున్నారు. మమతానురాగాలను కాదు అమ్మ, నాన్నల మృదువైన మాటల, లాలింపుల కరవు వారిని వెంటాడుతోంది’’ అని ఆగాడు కైలాసమూర్తి.

‘‘ఒరే! మీ నాన్నగారు నిన్ను మామూలు చదువు చదివించినా నీతో చనువుగా ఉండి ప్రేమ చూపించినందువల్లే ఇప్పటి క్కూడా నువ్వు ఆయన్ని విడిచి పెట్టకుండా కలిసే ఉన్నావు. కానీ నీ పిల్లలు అలా కాదు. చిన్ననాటి మధుర స్మృతులకు చాలా దూరంగా పెరిగారు. ఇందులో లేశ మాత్రమైనా వారి తప్పు లేదు. అమ్మగా అనన్య కూడా తప్పుగానే నడిచింది. అమ్మతనంలోని కమ్మనితనం లోటు చేసింది’’ భావోద్విగ్నతకు ప్రతిబింబంలా ఉన్నది ఇందుమతి.

‘‘ఎప్పుడైనా పిల్లలు పిల్లలే! తెలిసో తెలియకో అలా ప్రవర్తించారు. ఇష్టం ఉన్నా లేకపోయినా మీరు చెప్పించిన చదువులే చదివారు. మీరు రుద్ది చదివించినా ఎదిరించలేదు. స్వేచ్ఛ లేకుండానే గడిపారు. మరి ఇంత కాలానికి మీకు దూరమయ్యామన్న చింతకంటే స్వేచ్ఛ దొరికిందనే సంతోషమే అధికంగా నెలకొన్నది. ఆ స్వేచ్ఛతోనే తమకు నచ్చిన జీవిత భాగస్వాములను ఎంచుకున్నారు. ఇందులో వారి తప్పు నాకేం కనిపించటం లేదు. వారిని మీ అనుబంధాలకు దూరంగా ఉంచటం మీరు చేసిన తప్పు’’ అన్నాడు కైలాసమూర్తి.

‘‘నాన్నగారూ! మేం ఏం కోరుకున్నామో అది నెరవేరింది తప్ప పిల్లలకు ఏం అందించాలో అది అందించలేక పోయాం. అదే మీ మాటల్లో మాకు తెలిసి వచ్చింది. మేం చేసిన తప్పు మమ్మల్ని దారుణంగా హింసిస్తోంది’’. ఆపుకోలేని వ్యథ శ్రీవాత్సవను అలా పలికించింది.

అనన్య కూడా పరితాపం వ్యక్తం చేస్తూ ‘‘అమ్మగా నా లాలనను, అనురాగాన్ని పెద్దగా అందించలేకపోయాను. చదువుతో పెంచాను తప్ప చనువుగా పెంచలేక పోయాను. ఆ దేముడు నన్ను ఏ విధంగా శిక్షించినా సంతోషిస్తాను’’ అని కంట తడిపెట్టింది.

‘‘ఏమిట్రా! పసిపిల్లల్లా ఆ కన్నీళ్ళు! పిల్లలే మిమ్మల్ని శిక్షించారు. ఎలాగో తెలుసా? ఇంత కాలం మీరు చెప్పినట్లు బుద్ధిగా విన్నాం. మరి మీరు కూడా మా మాటవినకపోతేగానీ వీల్లేదంటూ, తాము మెచ్చుకున్న వధువులను సిద్ధం చేసుకొని మరీ హెచ్చరించారు. మరి మీరు కూడా వారి అభీష్టాలను వ్యతిరేకించకుండా నిండుగా ఆశీర్వదించటం మీ కర్తవ్యం’’ అంది ఇందుమతి కొడుకు, కోడలుతో...

‘‘ఔను! మీరు ఆ వచ్చే అమెరికా కోడళ్ళతో వచ్చీరానీ ఇంగ్లీషు ముక్కలు మాట్లాడుతూ వారికి మన తెలుగు ముక్కలు మప్పండి’’ అంటూ నవ్వేసాడు కైలాసమూర్తి.

‘‘ఔనర్రా! అమెరికా కోడళ్ళు ఎర్రగా బుర్రగా ఉంటారు... మా మనవళ్ళు కూడా ఎర్రగా బుర్రగానే పుడతారు..’’ అన్నది ఇందుమతి నవ్వుతూ..

ఆ వాతావరణం తేలికపడి నవ్వుల జల్లులు కురిసాయి.

*

రచయిత సెల్ నెం: **94926 20382**

విచ్చుకోవాలి హృదయం

కిటికీ తెరవగానే
శుభ్ర శీతల సమీరం లాంటి మధురోహ ఒకటి
బంగారు పావురమై రివ్వున వచ్చి
వాలుతుంది నా భుజం మీద
అప్పటిదాకా ఊపిరి సలపనీయని శ్వాసరాహిత్యం
శృంఖలాల్ని ఛేదించుకున్నట్టు
అవిశ్రాంత ఊహల కల్లోల కడలికి ఆటవిడుపు

ముకుళిత కుసుమంలా పడివున్న
పుస్తకపు అంతరాళాన్ని తెరవగానే
పరమిళభరితమైన చంద్రకాంతి
చిరుమేఘమై ఎగిరి వచ్చి
కమ్ముకుంటుంది నన్ను సమ్మోహనకరంగా
నిలువెల్లా నిస్రాణ ఆవహించిన దేహానికీ
నిరుత్సాహం నీరుగార్చిన మస్తిష్కానికీ
శ్రీ చందన స్పర్శలా చల్లని పరామర్శ

పాత ఫొటోల ఆల్బమ్‌లో
పాతర అయివున్న జ్ఞాపకాల గుప్తనిధిని
నెమ్మది నెమ్మదిగా పెకలిస్తుంటే
ఎండి మోడైన హృదయం మీద
నీలిరాగపు ఊటలు నింపాదిగా
పారాడిన పరవశోహేల!

తెరచుకోనంతవరకే
ముడుచుకు పోయినతనపు పరితాపం
విచ్చుకోవాలే గానీ
వినూత్న స్వప్న విహాయసానికి
గవాక్షాన్ని తెరచినట్టే!

-ఎలనాగ